సాక్షి సంగారెడ్డి

బుధవారం | 29 | నవంబర్ | 2023



కేంద్ర బలగాల కవాతు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. వివరాలు 2లో ▸



సద్వినియోగం చేసుకోవాలి

ఓటుహక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శాసనసభ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వివరాలు 2లో ▸

పంపిణీ కేంద్రం పరిశీలన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలంలోని రుద్రారం చైతన్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ శరత్ మంగళవారం రాత్రి సందర్శించారు. పంపిణీ తీరును పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



నల్లవల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న జయశ్రీరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీఆర్‌డీఏ జిల్లా పీడీ జయశ్రీరాజ్ సందర్శించారు. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా చేసిన ధాన్యాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం సంగారెడ్డిలోని శిశుగృహాన్ని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. ఆయాలు భోజనం తినిపిస్తున్నారా అంటూ ఆరా తీశారు. చలికాలం పిల్లలను జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. చిన్నారుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల సిబ్బంది ఆందోళన



సిబ్బందితో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి దేవుజా, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఆర్వో(రిటర్నింగ్ ఆఫీస్) కార్యాలయం ఎదుట ఎన్నికల సిబ్బంది ఆందోళనకు దిగారు. ఇక్కడ నివాసం ఉంటూ వేరే జిల్లాలో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బంది తమకు పోలింగ్ బ్యాలెట్ ఇవ్వడం లేదంటూ ఆందోళనకు దిగారు. చాలా మంది సిబ్బంది ఓటు వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. ఈ విషయాన్ని కలెక్టర్ శరత్‌కుమార్‌కి తెలియజేయడంతో వారికి కూడా పోలింగ్ బ్యాలెట్ ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బంది ఆందోళన చేస్తున్నారని తెలిసి డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఆర్వో దేవుజా హుటాహుటిన వచ్చి పోలింగ్ బ్యాలెట్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో ఆందోళన సద్దుమణిగింది. పోలింగ్ బ్యాలెట్ తీసుకొని సిబ్బంది ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నారు. దీనిపై ఆర్‌ఓను వివరణ కోరగా సిబ్బంది పనిచేసే చోట ఫాం-12 దరఖాస్తు చేసుకోలేదని, దీంతో పోలింగ్ బ్యాలెట్ ఇవ్వలేకపోయామన్నారు.

హోరెత్తించారు!



- చివరిరోజు భారీ ర్యాలీలు, పాదయాత్రలు
- అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్ బహిరంగ సభలు
- జిల్లాకు వరుస కట్టిన కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతలు
- పక్షం రోజులుగా పెద్దఎత్తున సాగిన ప్రచారం
- ముగిసిన ప్రచార పర్వం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. పక్షం రోజుల పాటు అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకున్న అభ్యర్థులు మరోవైపు ర్యాలీలు, రోడ్‌షోలతో హంగామా చేశారు. రెండు నెలల ముందే అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగింది. ప్రణాళికాబద్ధంగా ఈ పార్టీ అభ్యర్థులు నియోజకవర్గాలు రెండు, మూడు పర్యాయాలు చుట్టేశారు. పలు నియోజకవర్గాల్లో నామినేషన్ల చివరి వరకు అభ్యర్థిత్వాలు ఖరారు కాకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారానికి కొన్ని రోజులే సమయం దొరికింది. ఆ కొద్ది రోజుల్లోనే ఆ పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించారు.

అన్ని చోట్ల సీఎం కేసీఆర్ బహిరంగ సభలు

జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ బహిరంగసభలు జరిగాయి. సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లో జరిగిన బహిరంగసభల్లో ప్రసంగించారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వివరిస్తూనే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ సమస్య తలెత్తుతుందని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. మరోవైపు మంత్రి హరీశ్‌రావు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పలుమార్లు ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలు, సభలు, సమావేశాలతో రెండు నెలలుగా క్షణం తీరిక లేకుండా గడిపారు. కేటీఆర్ రోడ్‌షోలు కూడా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో జరిగాయి.

బీజేపీ అగ్రనేతలు వచ్చినా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అగ్రనేతలు కూడా జిల్లాకు వచ్చారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సంగారెడ్డిలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. జహీరాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప పాల్గొన్నారు. పటాన్‌చెరు బహిరంగసభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. అగ్రనేతలు జిల్లాకు వచ్చినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థులు మాత్రం మొక్కుబడిగా ప్రచారం చేశారు.

స్వతంత్రులు సైతం..

స్వతంత్రులు, ప్రధానేతర పార్టీల అభ్యర్థులు సైతం ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ అభ్యర్థులు కూడా జోరుగానే ప్రచారం నిర్వహించారు. మరోవైపు సాధారణ రీతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు మరోవైపు సోషల్‌మీడియాపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు సోషల్‌మీడియాలో వినూత్న రీతిలో వారి ప్రచారం కొనసాగింది.

చివరి రోజు భారీ ర్యాలీలు

ప్రచారంలో చివరి రోజు మంగళవారం అన్ని పార్టీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో హోరెత్తించారు. బైక్‌ర్యాలీలతో పాటు, పాదయాత్రలు నిర్వహించారు. సంగారెడ్డి, జోగిపేట, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల కేంద్రాలతో పాటు, పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ప్రధాన పార్టీల ర్యాలీలు జరిగాయి. మొత్తం మీద పక్షం రోజుల పాటు ఎన్నికల ప్రచార పర్వం తారాస్థాయిలో జరిగింది.

బీఆర్ఎస్‌కు దీటుగా కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించింది. అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లింది. అధికార బీఆర్ఎస్‌కు దీటుగా బహిరంగ సభలను నిర్వహించింది. ఆ పార్టీ జాతీయ నాయకులు సైతం జిల్లాకు వరుస కట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సంగారెడ్డిలో జరిగిన బహిరంగసభలకు హాజరయ్యారు. చివరి రోజు ప్రియంకాగాంధీ రోడ్‌షో జహీరాబాద్‌లో జరిగింది. నారాయణఖేడ్, పటాన్‌చెరుల్లోని బహిరంగసభలకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరయ్యారు.



ప్రియాంకగాంధీకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్, ప్రమీల దంపతులు

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం

- చెరకు, నిమ్జ్ సమస్యలను పరిష్కరించేలా చూస్తా
- జహీరాబాద్ ప్రజలకు ప్రియాంకగాంధీ భరోసా

జహీరాబాద్: చెరకు రైతులు, నిమ్జ్ భూ బాధితుల సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ జహీరాబాద్ ప్రజలకు భరోసా ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస్ థియేటర్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్‌ను గెలిపించాలన్నారు. తాను జహీరాబాద్ వచ్చి చెరకు, నిమ్జ్ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. తమ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ సౌమ్యుడని, సహాయం చేసే గుణముందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. పక్కనే ఉన్న కర్ణాటకలో తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, వారు మాత్రమే లబ్ధిపొందారని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ప్రియాంకగాంధీ అన్నారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలే ఇందుకు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం 24 గంటల పాటు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

21 నిమిషాల పాటు ప్రసంగం

ప్రియాంక గాంధీ జహీరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో 21 నిమిషాల పాటు ప్రసంగించారు. అంతకు ముందు కాంగ్రెస్ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ ప్రసంగించారు. ఉదయం 11.45 గంటలకు ప్రియాంకగాంధీ హెలీకాప్టర్ జహీరాబాద్‌కు చేరుకుంది. అనంతరం ఆమె వాహనంలో రోడ్‌షోలో పాల్గొనేందుకు బయలుదేరారు. రోడ్‌షోకు ప్రజలు భారీగా తరలిరావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. 65వ జాతీయ రహదారికి ఇరువైపులా ప్రజలు చేరుకుని ఆమె ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. ప్రియాంకగాంధీకి కాంగ్రెస్ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్, ప్రమీల దంపతులు, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, కర్ణాటక మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, ఎంపీపీ అధ్యక్షుడు ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎంజి రాములు, జి.అశోక్, ఖాజ స్వాగతం పలికారు.

రేపే ఓట్ల జాతర!

- పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- స్వేచ్ఛగా ఓటు వేయండి: కలెక్టర్ శరత్
- కేంద్రాల వద్ద బందోబస్తు: ఎస్పీ రూపేష్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ ఈనెల 30వ తేదీన జరుగనుంది. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 13.93 లక్షల మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం మొత్తం 1,609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 389 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు.

పోలింగ్ విధుల్లో ఏడు వేల మంది..

జిల్లాలో మొత్తం 7,068 మంది పోలింగ్ విధులను నిర్వహించనున్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలు పోలింగ్ ప్రక్రియలో భాగం పంచుకోనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల బృందాల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. ఎన్నికల విధులను నిర్వహించనున్న అధికారులు, సిబ్బందిని ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. పోలింగ్ విధులు నిర్వర్తించనున్న అధికారులు, సిబ్బంది బుధవారం పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లనున్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు.

ఎర్రర్ ఫ్రీ ఎన్నికలు: కలెక్టర్ శరత్

ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎర్రర్ ఫ్రీ ఎన్నికలు నిర్వహిస్తాం. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా నియోజకవర్గాల్లో స్థానికేతరులు బస చేసిన లాడ్జీలు, హోటల్స్ ఖాళీ చేసి వెళ్లిపోవాలి. అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి.

మొత్తం ఓటర్లు	13.93 లక్షలు
పురుషులు	7.02 లక్షలు
స్త్రీలు	6.91 లక్షలు
థర్డ్ జెండర్	128
మొత్తం పోలింగ్ కేంద్రాలు	1,609
పోలింగ్ సిబ్బంది	7,069
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	389
వెబ్‌కాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు	1,039
సీసీటీవీ కవరేజ్ పోలింగ్ కేంద్రాలు	689
వీడియో కవరేజీ పోలింగ్ కేంద్రాలు	352

పోలింగ్ కేంద్రాలు..

నారాయణఖేడ్	296
అందోల్	313
జహీరాబాద్	314
సంగారెడ్డి	281
పటాన్‌చెరు	405
మొత్తం	1,609

ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
నారాయణఖేడ్	116581	114599	8	231188
అందోల్	122699	126543	6	249248
జహీరాబాద్	136523	134259	3	270785
సంగారెడ్డి	121636	123582	35	245253
పటాన్‌చెరు	205045	192116	76	3,97,237

అభివృద్ధి చూసి ప్రజలు ఆశీర్వదిస్తారు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



➡ ఎన్నికల ప్రచారం ఎలా సాగింది?

ఎమ్మెల్యే: బ్రహ్మాండంగా సాగింది. బీఆర్ఎస్ శ్రేణులు అందరూ చక్కగా పనిచేశారు. నిత్యం ప్రజలతో ఉండే మాకు, ప్రచారానికి అన్ని వర్గాల మద్దతు లభించింది. నియోజకవర్గం పరిధిలో అన్ని గ్రామాలను, పట్టణాల ప్రజలకు కారు గుర్తు పై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశాం.

➡ పదేళ్లుగా మీరు అధికారంలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పెరిగిందని భావిస్తున్నారా?

ఎమ్మెల్యే: లేదు. ప్రజలకు దూరంగా ఉండే వారికి, అలాంటి పార్టీ ప్రభుత్వాలకు సమస్య ఉంటుంది. అన్ని వర్గాల కష్టసుఖాల్లో తోడుగా ఉండే మా ప్రభుత్వానికి ఆ పరిస్థితి లేదు.

➡ హ్యాట్రిక్ సాధిస్తే చేపట్టనున్న పనుల వివరాలు తెలపండి?

ఎమ్మెల్యే: ప్రజలందరికీ అందుబాటులో ఉంటా. నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. కేసీఆర్ ఆశీస్సులతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.

➡ మీకు పోటీ ఎవరితో ఉంది?

ఎమ్మెల్యే: ఎవరితోనూ లేదు. రెండు, మూడు స్థానాల కోసం ఇతర పార్టీలు పోటీ పడుతున్నాయి.

➡ గెలుపుపై అంతా ధీమాగా ఉన్నారు. కారణం చెప్పండి?

ఎమ్మెల్యే: బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు మా పార్టీకి మద్దతు ఇస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇప్పటి వరకు ప్రతీ రోజూ ప్రజల మధ్యే ఉన్నా. ప్రజలకు సేవకుడిగా పనిచేస్తున్న. పదేళ్లలో జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదు. అన్ని వర్గాలను కేసీఆర్ సమానంగా చూస్తున్నారు. క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ పండుగలను ఘనంగా నిర్వహించాం. అన్ని వర్గాల ఆశీర్వాదాలు మాపై ఉన్నాయి.

➡ యువత మీ పార్టీపై అసంతృప్తితో ఉంది?

ఎమ్మెల్యే: ఉద్యోగాల కల్పన, కొత్త పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. సొంత నిధులతో వందలాది మందికి ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాను. దివ్యాంగులకు మోటర్ సైకిళ్లు ఉచితంగా ఇచ్చాను. యువతకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించాం.

➡ గ్రామాలు, పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ట్రాఫిక్ సమస్యల తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు లేవు?

ఎమ్మెల్యే: గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రోడ్లు వేశాం. కొత్త రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. ఇటీవల కేసీఆర్ పటాన్‌చెరుకు ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చినప్పుడు రోడ్ల అభివృద్ధికి నిధులుకావాలని అడిగితే వాటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మరోసారి ఈ ప్రభుత్వాన్ని బలపరిస్తే నిరంతరం అభివృద్ధి కొనసాగుతుంది.

–సాక్షి, పటాన్‌చెరు

సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత

సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత అన్నారు. మంగళవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. నారాయణఖేడ్ నుంచి బషీర్ మాట్లాడుతూ నారాయణఖేడ్ కార్గో పార్సిల్ బుక్ చేస్తే ఆలస్యంగా వస్తోందని త్వరగా వచ్చేలా చూడాలన్నారు. కంది నుంచి జైపాల్ మాట్లాడుతూ చర్యలు జల్కల్ స్కూల్ బస్సును రెగ్యులర్ గా నడపాలన్నారు. సంగారెడ్డి నుంచి నరేష్ మాట్లాడుతూ శబరిమలైకి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. గడిపెద్దాపూర్ నుంచి ప్రభాకర్ మాట్లాడుతూ మెదక్ నుంచి పెద్దశంకరంపేట, గడిపెద్దాపూర్ మీదుగా సర్వీస్ నడపాలి విజ్ఞప్తి చేశారు. మల్లికార్జున్ పల్లి నుంచి మనోహర్ మాట్లాడుతూ సదాశివపేట నుంచి మల్లికార్జునపల్లి వయా మునిపల్లి మీదుగా బస్సులు నడపాలన్నారు. సిర్గాపూర్ నుంచి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ నారాయణఖేడ్ నుంచి పిట్లం వరకు బస్సులు నడపాలి కోరారు. ప్రజల సమస్యలను విన్న ఆర్‌యం త్వరలోనే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికలు కీలకం

- ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగిస్తే సహించం
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎస్పీ చెన్నూరి రూపేష్



ఎన్నికల విధులు వివరిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి /పటాన్‌చెరు టౌన్: ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికల ప్రక్రియ చాలా కీలకమని, ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి విధుల గురించి వివరించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లరాదన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్‌లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూత్ లోనికి తీసుకువెళ్లరాదని, సెల్ఫీలు దిగడం నిషేధమన్నారు. ప్రజలు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు, సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్, సబ్-డివిజన్ సీఐలు శ్రీధర్ రెడ్డి, చంద్రయ్య, సుధీర్ కుమార్, నాగరాజు, ఎస్ఐలు, వివిధ జిల్లాలకు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుతున్నారు

నీలం మధు ముదిరాజ్



❖ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రజల స్పందన ఎలా ఉంది?

నీలం మధు: అన్ని వర్గాల ప్రజలు నాకు మద్దతు ఇస్తున్నారు. కుల మతాలకతీతంగా పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా నా ప్రచారానికి స్వాగతం పలికారు. నాకు ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి నేను ఊహించిన దాని కంటే ఎక్కువగా ఆదరించారు, అభిమానించారు. కాంగ్రెస్ కారణంగా కొంత ఆలస్యం అయినప్పటికీ అన్ని విషయాలు అర్థం చేసుకొని నా ప్రచారానికి విశేషంగా స్పందించారు. కచ్చితంగా గెలుస్తాననే నమ్మకం నాకు కలిగింది. ఎంతోమంది వివిధ పార్టీల నుంచి బీఎస్పీలో చేరారు. ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని స్వచ్ఛందంగా యువకులు, మహిళలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించిన నాకు అది రాకపోవడంతో స్వతంత్రంగా నియోజకవర్గ ర్యాలీ చేస్తూ కాలినడకన ప్రచారం ప్రారంభించాను. అది మీ అందరికి తెలిసిందే, అయితే కాంగ్రెస్ నాయకులు నన్ను పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారు. బీఎస్పీ నాకు టికెట్ ఇచ్చింది. నేను ఏనుగు గుర్తుపై పోటీ చేస్తునట్లు ప్రకటించి ప్రజల్లోకి వెళ్లాను. ప్రజలు మంగళహారతులు ఇచ్చి నాకు స్వాగతం పలికారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు నాపై చూపెట్టిన అభిమానానికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఏనుగు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నాను.

❖ మీకు పోటీ ఎవరితో ఉంది అని భావిస్తున్నారు?

➡ ప్రజల సంపూర్ణ మద్దతు నాకు ఉంది. నాకు ఎవరితో పోటీ లేదు. ప్రజలు ఎమ్మెల్యేపై విసుగు చెంది ఉన్నారు. ఆ కుటుంబం ఆగడాలను భరించే స్థితిలో లేరు. ప్రజలు మార్పు కోరుతున్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు ప్రజలకు దూరంగా ఉన్నారు. తొలిసారి పోటీలో ఉన్న నాపై పటాన్‌చెరు ఓటర్లు ఆసక్తి చూపారు. ప్రజల కోరిక మేరకు వారికి సేవకుడిగా ఉంటానని ప్రజల నమ్ముతున్నారు.

❖ మీరు గెలిస్తే పటాన్‌చెరు ప్రజలకు ఏమి చేస్తారు?

➡ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తాను. కార్మికులు, పేదలకు వంద గజాల స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు నిర్మించి ఇస్తాను. కార్మికుల కోసం ఎస్ఎంఆర్ క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5లకే భోజనం అందేలా చేస్తాను. పేదలందరికీ సత్వర న్యాయం అందించేందుకు ప్రత్యేక న్యాయసేవా కేంద్రం ఏర్పాటు చేస్తా. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ గుడ్ మార్నింగ్ పటాన్‌చెరు నిర్వహిస్తాను. విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. స్థానిక నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను. ఈ ప్రాంతంలో బతుకుదెరువు కోసం వచ్చిన అన్ని రాష్ట్రాల ప్రజల సంక్షేమానికి కృషిచేస్తాను.

–సాక్షి, పటాన్‌చెరు

క్లుప్తంగా

తూప్రాన్‌లో ఫ్లాగ్‌మార్చ్



తూప్రాన్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తూప్రాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ఎన్నికల నియామావళిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

హత్నూర(సంగారెడ్డి): పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సెక్టోరియల్ అధికారి భూపుత్ర అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రమైన హత్నూర, కాసాల, బ్రాహ్మణగూడ, గోవిందరాజు పల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలలో నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సౌకర్యంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. మొత్తం 69 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యుత్, తాగు నీరు, ర్యాంప్‌ల సౌకర్యాలను పరిశీలించారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



బీఎల్ఓలతో మాట్లాడుతున్న సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సూచించారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీఎల్ఓలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్‌తో పాటు బీఎల్ఓలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ లింక్ చేసుకోండి

నారాయణఖేడ్: భారత్‌గ్యాస్ వినియోగదారులు డిసెంబర్ 31వ తేదీలోపు గ్యాస్ కనెక్షన్‌ను ఆధార్, బయోమెట్రిక్‌తో లింక్ చేసుకోవాలని ఖేడ్ డిస్ట్రిబ్యూటర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. లింక్ చేసుకోకపోతే గ్యాస్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు.

ఓటింగ్‌పై అవగాహన చిత్రం



ఈనెల 30న ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని అవగాహన కల్పిస్తూ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రాగి ఆకుపై చిత్రాన్ని గీశారు. దీనిని చూసిన పలువురు ఆయనను ప్రశంసించారు. – నారాయణఖేడ్

గుబాళించిన గజ్వేల్



సభలో మహిళా కార్యకర్తల సందడి



సీఎంకు స్వాగతం పలుకుతున్న నాయకులు



కేసీఆర్ మాస్క్‌తో..



గులాబీ శ్రేణుల జోష్..



సభలో ముఖ్యమంత్రికి తిలకం దిద్దుతున్న మహిళ

గజ్వేల్/గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణం గులాబీమయమైంది. సీఎం కేసీఆర్ తన చిట్టచివరి ఎన్నికల ప్రచార సభను సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో నిర్వహించడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. పట్టణంలోని ఐఓసీ వెనుకభాగంలోని మైదానంలో సభా వేదిక ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.53 గంటలకు కేసీఆర్ వేదికపైకి చేరుకున్నారు. ఆ సమయంలో జనం ఒక్కసారిగా కేరింతలు కొడుతూ... నినాదాలతో హోరెత్తించారు. మహిళా ప్రజాప్రతినిధులు సీఎంకు తిలకం దిద్ది స్వాగతం పలకగా... మైనార్టీ నేతలు దట్టీ కట్టారు. సభకు అధ్యక్షత వహించిన అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముందుగా ప్రసంగించారు. ఈ సందర్భంలో నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యల చిట్టాను సీఎం ముందు ఉంచారు. ఆ తర్వాత మాజీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ భూంరెడ్డి, మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ తన ప్రసంగాన్ని 3.09గంటలకు ప్రారంభించి అరగంటకుపైగా కొనసాగించారు.

ఆకట్టుకున్న ఏపూరి, మధుప్రియల ఆటాపాట

కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద' బహిరంగ సభలో ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, మధుప్రియ తమ ఆటపాటలతో సభికులను ఆకట్టుకున్నారు. అప్పుడెట్లుండె తెలంగాణ... ఇప్పుడెట్లుందంటూ కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు

ఆరు గ్యారంటీలపై బాండ్ పేపర్

• నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

హత్నూర (సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీలపై నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి బాండ్ పేపర్‌ను హత్నూర మండలం దౌల్తాబాద్ ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం సాయంత్రం రిలీజ్ చేశారు. ఆవుల రాజిరెడ్డి అనే నేను... హామీ ఇస్తున్న... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని మాట ఇస్తున్నట్లు బాండ్ పేపర్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ అని, ఆరు గ్యారంటీలు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని మండలానికో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలల నిర్మాణం చేపడుతామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని, వాటిని ప్రజలు నమ్మరని చెప్పారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి హకీమ్, నాయకులు రవీందర్ రెడ్డి, సర్పంచ్ కొన్నాల వెంకటేశం, ఉప సర్పంచ్ రియాజ్ అలీ ఉన్నారు.



దౌల్తాబాద్ లో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలన అవినీతిమయంగా సాగిందని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ లో రాజిరెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క గ్రామం అభివృద్ధి చెందలేదన్నారు. బడుగు బలహీన వర్గాలను పట్టించుకోలేదని విమర్శించారు. కమీషన్ల పేరుతో కేసీఆర్ కుటుంబం దోచుకుందన్నారు. కేసీఆర్ మాటలకు ప్రజలు రెండుసార్లు మోసపోయారని, మూడోసారి అందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, హకీం, సుజాత, కృష్ణ, వెంకటేశం, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

ఖేడ్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటేయాలని ఖేడ్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి కోరారు. పంచగామ, మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్, మంగల్‌పేట్ కుమ్మరివాడలో ప్రచారం నిర్వహించారు. అనంతరం శివాజీచౌక్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు స్వప్న అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు.



కుండను తయారు చేస్తున్న భూపాల్‌రెడ్డి



ఇస్త్రీ కొడతా.. గెలిపిస్తే సేవ చేస్తా..

దుబ్బాకరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఓ లాండ్రీ షాపులో బట్టలను ఇస్త్రీ చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. చెయ్యి గుర్తుకే ఓటేయాలని కోరారు.



కారుకే ఓటేయమని మమ్మీకి చెప్పవా..!

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి విజయం కోసం ఆమె కోడలు రుత్వికారెడ్డి కౌన్సిలర్ సునీతతో కలిసి ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ఓ ఇంట్లో చిన్నారిని ఎత్తుకుని లాలించారు. కారు గుర్తుకే ఓటు వేయాలని పిల్లాడి తల్లిని అభ్యర్థించారు.



చికెన్ కొడుతా... ఓట్లు రాబడుతా...

రామాయంపేట(మెదక్): దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్తా ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఓ దుకాణంలో చికెన్ కొట్టారు. అదేవిధంగా హోటల్‌లో మిర్చీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే నార్సింగి చెరువులో వేసినట్లే

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ సుతిలేని సంసారం లాంటిదని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. నార్సింగి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నార్సింగి చెరువులో వేసినట్లు అవుతుందని ఆరోపించారు. దళితున్ని సీఎం చేస్తామని చెప్పి కేసీఆర్‌లాగా తాము మోసం చేయలేమని, బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతాడని ఆయన పేర్కొన్నారు. గిరిజన బిడ్డను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి సేవలను బీఆర్ఎస్ వారు మరిచిపోయారని ఆరోపించారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు పట్టణంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో రఘునందన్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంది హరీశే..

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి జరగకుండా మంత్రి హరీశ్‌రావు అడ్డుకున్నాడని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. మంగళవారం చేగుంటలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ గెలిచిన నాటినుంచి తాను చేగుంట డిగ్రీ కళాశాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారని విమర్శించారు. తాను గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.100కోట్ల కేంద్రం నిధులు మంజూరి చేయించానన్నారు. ఎంపీగా గెలిచి తొమ్మిదేళ్లయినా చేగుంట-మెదక్ రోడ్డులో రైల్వే బ్రిడ్జి గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఉద్యమకారుడు దివంగత నేత రామలింగారెడ్డి కుటుంబాన్ని మంత్రి హరీష్‌రావు నామరూపాలు లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తనను ఓడించడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామచంద్రం, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచులు బాలచంద్రం, రఘువీర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, జగన్‌గౌడ్, వెంగళ్‌రావు, కర్నపాండు పాల్గొన్నారు.



చేగుంటలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఓటుహక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం ఎస్పీ రూపేష్ తో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, మొత్తం 13, 93,711 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం నిషేధించామని, ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 28 సాయంత్రం 5 గంటల నుంచి ఇతర జిల్లాల వ్యక్తులు జిల్లాలో ఉండకూడదన్నారు. అలాగే ఒపీనియన్, ఎగ్జిట్ పోల్స్ నిషేధించినట్లు తెలిపారు. జిల్లాలో మద్యం షాపులు మూసియాలని, డ్రైడేగా ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర శాసన సభకు ఈనెల 30వ తేదీన పోలింగ్ జరగనున్నందున ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 29వ తేదీ కూడా సెలవు దినంగా ప్రకటిస్తూ స్థానికంగా ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ 4800 సిబ్బంది, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్

సిబ్బంది కేటాయింపు పూర్తి

ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఆయా కేంద్రాలకు కేటాయించినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఐదు నియోజక వర్గాల్లో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలు, పీడబ్ల్యూడీ, యూత్ మేనేజ్‌మెంట్, మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అబ్జర్వర్లకు వివరించారు. సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, నాజీమ్ జై ఖాన్, అదనపు కలెక్టర్ మాధురి, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మళ్లీ అధికారంలోకి రాగానే పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు కేసీఆర్ కార్యాచరణ రూపొందించారని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర మండలం బోరపట్ల, రెడ్డి ఖానాపూర్, కాసాల, చందాపూర్, హత్నూర, నస్తీపూర్, మల్కాపూర్ తదితర గ్రామాలలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు విమర్శలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీటీసీ ఆంజనేయులు, దుర్గారెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన కౌడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతోపాటు సీసీ, బీటీ రోడ్లు వేసిందన్నారు. ఆసరా పింఛన్ల పెంపుతోపాటు రైతుబంధు, రైతుబీమా కల్పించినట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400కు గ్యాస్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, సర్పంచ్ వెంటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శివాంజనేయులు, చిన్నంరెడ్డి, దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి, శెట్టయ్య, దుర్గాగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మండలంలోని సలాబత్‌పూర్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌గౌడ్ మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సునీతారెడ్డి గెలుపుకోసం కృషి చేస్తామమని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, సర్దార్, పెంటయ్య పాల్గొన్నారు.

అత్త కోసం కోడలు..

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోసునీతారెడ్డికి మద్దతుగా ఆమె కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. కుమారుడు ఓ వైపు, కోడళ్లు మరోవైపు కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, నాగరాజు, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, మల్లేశం, పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: ఎన్నికల ప్రచారం చివరి సమయంలో సునీతారెడ్డి పట్టణంలోని 15, 14, 8వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నయీమ్, అశోక్‌గౌడ్, పంబల్ల లలితా బిక్షపతి, సరిత, రామచందర్ పాల్గొన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.సునీతారెడ్డి కోడలు రుత్వికారెడ్డి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆమె వెంట కౌన్సిలర్లు, నాయకులు అశోక్‌గౌడ్, సునీత, లలిత, సరిత, బాల్‌రెడ్డి, రవూఫ్, బిక్షపతి, మాణయ్య, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపు కోసం ఆమె కోడలు రుత్వికారెడ్డి ప్రచారం నిర్వహించారు. చెన్నాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. రాంచందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బోరబట్లలో మాట్లాడుతున్న సునీతా లక్ష్మారెడ్డి



కౌడిపల్లిలో ప్రచారం చేస్తున్న మదన్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

నా కట్టె కాలే వరకు మీతోనే..

గంజ్ మైదానంలో భావోద్వేగానికి గురైన చింతా ప్రభాకర్



ప్రజలకు అభివాదం చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి: 'నా తుది శ్వాస వరకు మీ తోనేనని .. నేను బతుకుతానో.... చనిపోతానోననే పరిస్థితిలో ఉన్న నా కోసం మీరందరూ ఆలయాలు, చర్చి, మసీదులో ప్రార్థనలు చేశారు.. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది' సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నాడు. ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా పట్టణంలోని ఐటీఐ నుంచి గంజ్ మైదానం వరకు గులాబీ శ్రేణులు బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించారు. ఇందులో చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రచార రథం పైనుంచి చింత ప్రభాకర్ ప్రజలకు అభివాదం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం చింతా మాట్లాడుతూ.. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానానికి ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనిదన్నారు. తనకు ఇది చివరి అవకాశమని, చివరి కట్టె కాలేంత వరకు ప్రజల మధ్యలోనే ఉంటానని కంటతడి పెట్టుకున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో శాయశక్తులా కృషి చేస్తానని, జనమే తన బలం.. బలగమని తెలిపారు.